


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల
## (ప్రారంభం)

**జిటి ఎక్స్‌ప్రెస్** నాగపూర్ స్టేషన్‌లో ఆగి, కొంచెం ఆయాసం తగ్గాక తిరిగి ఢిల్లీవైపు పరుగు మొదలు పెట్టింది. కదిలిపోతున్న ట్రెయిన్‌లోకి ఎక్కిన హేమంత్ ఒకసారి చుట్టూ చూసి, చేతిలో బ్రీఫ్ కేస్‌ను పక్కగా పెట్టి కూర్చున్నాడు.

ట్రెయిన్ ముందుకు పరుగు తీస్తుంటే కిటికీలోనుంచి కనిపించే చెట్టు చేమల్లాగే అతడి ఆలోచనలు కూడా పొరలలో నుంచి వచ్చి అతడి కళ్ళలో దృశ్యాలుగా నిలుస్తున్నాయి. మరుపురాని, మరువలేని సంఘటనలు, ఒకదాని వెంట ఒకటిగా గొలుసులా గుర్తుకు వచ్చి అతడి మనసును అశాంతికి గురి చేస్తున్నాయి. అతడు సీట్లో వెనక్కు చేర్లబడి కూర్చుని ట్రెయిన్ ముందుకు పరుగు తీస్తుంటే కిటికీలోనుంచి కనిపించే చెట్టుచేమల్లాగే అతడి ఆలోచనలు కూడా వెనక్కు పరుగు తీస్తున్నాయి. ఒక్కొక్క జ్ఞాపకం మనసు పొరలలో నుంచి వచ్చి అతడి కళ్ళలో దృశ్యాలుగా నిలుస్తున్నాయి. మరపురాని, మరువలేని సంఘటనలు, ఒకదాని వెంట ఒకటిగా గొలుసులా గుర్తుకు వచ్చి అతడి మనసును అశాంతికి గురి చేస్తున్నాయి.

అతడు సీట్లో వెనక్కి చేర్లబడి కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

"ట్రెయిన్ మే కోయీ డాక్టర్ హై?"

కంగారుగా, బిగ్గరగా అరుస్తూ ఒక వ్యక్తి కంపార్ట్‌మెంట్‌లో చుట్టూ చూస్తూ వేగంగా వెళ్తున్నాడు ముందుకు.

ఆలోచనలలో కూరుకుపోయి ఉన్న హేమంత్ మనసు ఉలిక్కిపడింది. అతడిలోని డాక్టర్ అప్రమత్తమయ్యాడు. ఒక్క ఉదుటున లేచి అతడిని అనుసరించి వెళ్ళాడు తొందరగా

"ఏమైంది?" అంటూ అతడి భుజం పట్టి ఆపాడు డాక్టర్ హేమంత్.

"మీరు డాక్టరా సార్, రండి సార్ తొందరగా." అంటూ వెళ్తున్న అతడిని అనుసరించి వెళ్ళాడు హేమంత్ బ్రీఫ్‌కేస్ తీసుకుని.

ప్రయాణికులు చాలామంది ఒక బెర్త్ దగ్గర గుమికూడి ఉన్నారు.

"లేవండి, లేవండి, డాక్టర్‌గారు వచ్చారు" అంటూ ఆ వ్యక్తి బెర్త్ వైపు చూపించాడు హేమంత్‌కు,

"ఆమె పరిస్థితి బాగోలేదు సార్. చాలా బాధపడుతుంది" అంటూ.

"పాపం ఒకటే మూలుగుతుంది సార్" చెప్తున్నారు అక్కడివాళ్ళు. షాల్ కప్పుకుని వెనుతిరిగి పడుకుని ఉన్న ఆమె అశాంతిగా మూలుగుతుంది. చుట్టూ చూశాడు డాక్టర్ హేమంత్.

"దయచేసి అందరూ కొంచెం దూరంగా వెళ్ళండి. ఆమెకు గాలి తగలనివ్వండి. విండోస్ తెరవండి, ఫ్యానులు ఆన్ చెయ్యండి" అన్నాడు.

"మేడం, డాక్టర్ వచ్చారు లేవండి" అంటూ తోటి ప్రయాణికులు ఆమెను లేపే ప్రయత్నం చేస్తున్నారు.

ఆమె నుంచి ఎటువంటి స్పందనలేదు. మూలుగుతున్న శబ్దం కూడా సన్నగిల్లింది.

"తొందరగా ఆమెను ఇటు తిప్పండి" అంటూ బ్రీఫ్‌ను పక్క బెర్త్‌పై పెట్టి ఓపెన్ చేశాడు హేమంత్.

స్టెత్‌తో ఆమె గుండె స్పందనను వింటూ ఆదుర్దాగా ఆమె ముఖం వైపు చూశాడు. ముఖంపై సగం వరకు ఆమె చీర కొంగు కప్పి ఉంది.

తొందరగా ఒక ఇంజెక్షన్‌ను లోడ్ చేసి ఆమె చేతికి చేశాడు అతడు. ఆమె సన్నగా మూలిగింది. ముఖం మీద ఉన్న కొంగును పక్కకు తొలగించిన డాక్టర్ హేమంత్ కనుబొమలు ముడివడ్డాయి.

ఆత్రంగా ఆమె ముఖాన్ని తనవైపు తిప్పి మరింత దగ్గరగా పరిశీలనగా చూసిన డాక్టర్ హేమంత్ గుండె స్పందన ఒక్కసారిగా పెరిగింది.

అప్రయత్నంగా "లతా!" అన్నాడు బిగ్గరగా గాభరాగా చుట్టూ చుశాడతడు.

"ఎవరైనా తొందరగా చెయిన్ లాగి రైలు ఆపండి" అరిచాడతడు. అందరూ విస్మయంగా చూస్తున్నారు అతడివైపు. కంగారుగా బ్రీఫ్‌లో వెతికి మరో ఇంజెక్షన్ తీసి, ఆమె రెండవ చేతికి ఇచ్చాడు హేమంత్.

ఆమెలో ఎటువంటి కదలిక లేదు. అతని చేతివేళ్ళు కంపిస్తున్నాయి.

రైలు శబ్దం అతడి గుండెపై సుత్తితో బాదుతున్నట్లు బాధిస్తుంది. అంతలో రైలు కీచుమన్న శబ్దంతో ఆగిపోయింది.

తొందరగా సెల్ తీసి డయల్ చేశాడు డాక్టర్.

"హలో... డాక్టర్ అరుణ్" హేమంత్‌కు చాలా అలజడిగా వుంది మనసులో. మాటలు తడబడుతున్నాయి. చెమ్మగిల్లిన కళ్ళను షర్ట్ స్లీవ్‌తో తుడుచుకుంటున్నాడు అతడు.

"అరుణ్.. ట్రైన్ జస్ట్ నాగపూర్ దాటింది. నన్ను ఏమీ అడగొద్దు. ఆంబులెన్స్‌ను వెంటనే ఫుల్ ఎక్విమెంట్‌తో తీసుకురా. ఈ ఇంజెక్షన్స్ కూడా తీసుకురా. క్విక్" అంటూ ఏవో ఇంజెక్షన్ల పేర్లు కూడా చెప్పాడు అతడికి.

ఎవరో తడిపి ఇచ్చిన కర్చీఫ్‌తో ఆమె ముఖం తుడిచాడు హేమంత్.

"ఆమె మీకు తెలుసా సార్?" ఎవరో అడుగుతున్నారు. అతడికి మనసు అల్లకల్లోలంగా వుంది.

"ఊ" అన్నాడు, "ఆమెతో మరెవరైనా ఇక్కడ వున్నారా?" అడిగాడు హేమంత్.

"ఎవరూ లేరు సార్. ఆమె ఒకత్తే విజయవాడలో ఎక్కింది." మరొకతను హేమంత్‌కు దగ్గరగా వచ్చాడు.

"ఆమె ఇంతకు ముందు వరకు బాగానే వుంది కానీ చాలా నీరసంగా కనిపించింది. ఢిల్లీకి వెళ్తున్నట్టు చెప్పింది. ఆగ్రా చేరాలి అంది పాపం. గుండెపై చేత్తో రాసుకుంటూ మెలికలు తిరిగింది.."

"ఆమె నాకు తెలిసిన వ్యక్తే. దయచేసి ఆమె లగేజ్ ఏమైనా ఉందేమో చూడండి" అన్నాడు హేమంత్.

"ఇది నిజంగా జరుగుతుందా? కలైతే కాదుకదా?' మళ్ళీ చుట్టూ చూస్తూ "ఇది నిజమే! కలైతే కాదు. లత తన దగ్గరకే వద్దామని బయలుదేరిందన్నమాట. ఇన్నేళ్ళూ ఏమైపోయావ్ లతా? నువ్వెక్కడ వున్నా సుఖంగా ఉండాలని కోరుకుంటూ బతికేస్తున్నాను" దుఃఖం ముంచుకు వచ్చింది అతడికి.

"ఇక్కడ చెయిన్ పుల్ చేశారు ఎవరు? ఏమైంది?" రైల్వే గార్డ్ వచ్చి అడిగాడు.

"అవును సర్. నేనే చెయిన్ పుల్ చేశాను. ఆమె హెల్త్ కండిషన్ చాలా సీరియస్‌గా వుంది. వెంటనే మెడికల్ ఎయిడ్ కావాలి. నాగపూర్ నుండి అంబులెన్స్ వస్తుంది. ఆన్‌దివే. ప్లీజ్ కోపరేట్ చెయ్యండి." అర్థిస్తున్న హేమంత్ స్వరం కంపిస్తుంది.

"ఓకె, ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ ది సిట్యుయేషన్" అంటూ వేగంగా వెళ్ళిపోయాడతడు.

లేచి డోర్ దగ్గరకు వేగంగా వెళ్ళాడు హేమంత్.

"అదుగో అంబులెన్స్ వస్తుంది సార్ అంటున్నారు ప్రయాణికులు. రైల్వే ట్రాక్‌కు దగ్గరగానే వున్న రోడ్‌పై వేగంగా సైరన్‌తో వస్తుంది అంబులెన్స్.

కంపార్ట్‌మెంట్‌లో జనం క్రిందకు దిగిపోయిచేతులు ఊపుతూ అరుస్తున్నారు "తొందరగా రండి" అంటూ.

అంబులెన్స్‌లోనుంచి దిగి స్ట్రెచర్ తెస్తున్నారు వేగంగా ఇద్దరు డాక్టర్ అరుణ్ పరుగున కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు. అతడు ఒకసారి హేమంత్ ముఖంలోకి చూసి, పేషెంట్ పల్స్ చూస్తూ ఆమె ముఖంవైపు చూశాడు.

అతడు షాక్ తిన్నట్టు చూశాడు హేమంత్ ముఖంలోకి.

"లతా!" అన్నాడు హేమంత్ వైపు చూసి.

హేమంత్ తల ఊపాడు. దుఃఖంతో అతడి గొంతు పెగలటంలేదు.

"డోంట్ వర్రీ హేమంత్. లతకు బాగే వుంటుంది" అంటూ హేమంత్‌ను దగ్గరకు తీసుకున్నాడు అరుణ్.

అచేతనంగా ఉన్న ఆమెను స్ట్రెచర్‌పైకి మార్చి, తొందర తొందరగా అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

డాక్టర్ అరుణ్, హేమంత్ భుజం చుట్టూ చెయ్యివేసి నడుస్తున్నాడు వేగంగా.

"ఒక్క క్షణం" అంటూ ప్రయాణికులవైపు తిరిగాడు హేమంత్. వాళ్ళకి రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టు "మీరు చూపిన్ అమానవత్వానికి థాంక్స్" అంటూ.

ఒక ప్రయాణికుడు పరుగున వచ్చి "ఇవిగో సార్, ఈ బ్యాగ్‌లు రెండూ ఆవిడవే" అంటూ రెండు బ్యాగ్‌లను హేమంత్‌కు అందించాడు.

లత చేతికి త్వరత్వరగా సెలైన్ అమర్చాడు అరుణ్. సెలైన్ బాటిల్‌లోకే ఒక ఇంజెక్షన్‌ను రెండో చేతికి ఇచ్చాడు. డ్రైవర్‌తో "పోనియ్" అని చెప్పాడు.

అంబులెన్స్ సైరన్‌తో వేగంగా దూసుకుపోతుంది. ఆ వేగానికి కదిలిపోకుండా, లతపై చెయ్యివేసి పట్టుకుని కూర్చున్నాడు హేమంత్.

పల్స్ చూసిన అరుణ్ "ఫర్వాలేదు హేమంత్. పల్స్ నార్మల్ అవుతుంది, వర్రీకాకు" అన్నాడు.

అతడు అరుణ్ మాటలు విన్నట్టే లేదు. బాధగా చూశాడు అరుణ్ మౌనంగా.

చలాకీగా చిరునవ్వులు చిందిస్తూ తిరిగే తన లత, తన ప్రాణం. తన జీవితపు ఆకాశంపై విరిసిన హరివిల్లు ఆమె. ఇంద్రధనస్సులాగే తన జీవితంలో రంగులు నింపింది. అలాగే కనుమరుగైంది.

మళ్ళీ ఇంతకాలానికి ఇటువంటి స్థితిలో తన జీవితంలో ప్రవేశించిందా" అతడి కళ్ళు వర్షిస్తున్నాయి. 'భగవంతుడా నిన్ను అనేకసార్లు నిందించాను. నాకు నిష్కారణంగా విధించిన శిక్షలను భరించలేక. అందుకు నన్ను క్షమించు. శపించకు, ప్లీజ్ నా లతను తిరిగి నాకిచ్చేయ్" ప్రార్థిస్తున్నాడు అతడు.

మౌనంగా  దుఃఖిస్తున్న హేమంత్ భుజంపై తట్టాడు అరుణ్.

"హేమంత్, ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్, నువ్వు ఒక ఎఫిషియెంట్ కార్డియాక్ సర్జన్‌వి. ఈ పేషెంట్‌ను కాపాడగల శక్తి నీలో వుండి, బాధను పక్కకు నెట్టి, సిద్ధంకారా లతను కాపాడుకోవటానికి" హాస్పిటల్‌కు చేరేవరకు హేమంత్‌కు ధైర్యం చెప్తూనే వున్నాడు అరుణ్.

అంబులెన్స్‌ను చూస్తూనే హాస్పిటల్‌లో స్టాఫ్ అప్రమత్తమయ్యారు. త్వరత్వరగా ఆమెను లోపల బెడ్‌పైకి చేర్చి ఆక్సిజన్, సెలైన్‌లను తిరిగి అమర్చారు.

ఇసిజి, స్కాన్, ఎకో వంటి టెస్ట్ లన్నీ వరుసగా జరిగిపోయాయి. అవి పరిశీలించిన అరుణ్, హేమంత్ ముఖంలోకి చూశాడు. ఆ ఇద్దరు డాక్టర్ల కళ్ళు మాట్లాడుకునాయి. పరిస్థితి అర్ధమైంది.

ఏమో చెప్పబోయిన అరుణ్‌ను వారించాడు హేమంత్.

"అరుణ్, డాక్టర్ విన్సెంట్ కు వెంటనే ఫోన్ చెయ్యి. నేనేం చెయ్యలేను" అంటూ వాటర్ బాటిల్ తీసుకున్న హేమంత్ చేతి వేళ్ళు కంపించటం గమనించిన అరుణ్, "అవును, హేమంత్ వల్ల ఏంకాదు" అనుకున్నాడు. డాక్టర్ విన్సెంట్‌కు కాల్ చేశాడు.

"సర్, మీరు వెంటనే రావాలి. ఈజ్ ఇట్ ఈజ్ ఏన్ ఎమర్జెన్సీ"

"ఓ.కే" అన్నాడు అతడు.

త్వరత్వరగా ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయమని స్టాఫ్‌కు చెప్పాడు అరుణ్. అవసరమైన ఇతర డిపార్ట్‌మెంట్స్‌కు చెందిన సిబ్బందిని కూడా అలర్ట్ చేశాడు అతడు.

డాక్టర్ అరుణ్ ఏర్పాట్లన్నీ చేయించి వచ్చి హేమంత్ పక్కన కూర్చున్నాడు.

"విన్సెంట్ వస్తున్నారు హేమంత్, వర్రీకాకు. పల్స్ చూడు ఇంప్రూవ్ అవుతుంది" అంటూ.

అంతలో హాస్పిటల్ గేటులోనుంచి లోపలకు వచ్చిన కారు డోర్ తెరుచుకుంది. డాక్టర్ విన్సెంట్ దిగాడు కారులోనుంచి. అతడు పరుగు వంటి నడకతో వచ్చాడు. ఆ వెనుకే మరో రెండు కార్లు వచ్చయి. పొడవుగా, స్లిమ్ గా ఉంటాడు డాక్టర్ విన్సెంట్.

హేమంత్‌ను చూస్తూనే అతడు, "హేమంత్ నువ్వేంటి ఇక్కడ? ట్రెయిన్‌కు వెళ్ళావు కదా?" అన్నాడు ఆశ్చర్యంగా. అతదికి దగ్గరగా వెళ్ళి చేతులు పట్టుకున్నాడు హేమంత్.

"సర్ లతను కాపాడండి ప్లీజ్" అతడి స్వరం కంపించింది. విన్సెంట్‌కు అర్ధంకాలేదు, కాని హేమంత్ కళ్ళలో కనిపించిన తడిని గమనించాడతడు.

మారు మాట్లాడకుండా పేషెంట్ దగ్గరకు వెళ్ళాడు అరుణ్‌ను అనుసరించి.

ఆమెను చూసిన విన్సెంట్ అరుణ్ వైపు ఆశ్చర్యంగా చూశాడు. "ఈజ్ షి లత?" అంటూ.

"అవును సర్. తను మీ స్టూడెంట్ లతే. ఆమె ఈ స్థితిలో చాలా చిత్రంగా హేమంత్‌కు కనిపించింది" చెప్పాడు అరుణ్.

వాళ్ళ బ్యాచ్‌కి, మెడిసిన్ చదివేటపుడు డాక్టర్ విన్సెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నాడు. నాగపూర్ వాసి అయిన డాక్టర్ విన్సెంట్, హేమంత్ హాస్పిటల్‌కు విజిటింగ్ సర్జన్ కార్డియాలజీ విభాగానికి.

అతడు "ఓకె.. ఓకె రిపోర్ట్స్" అన్నాడు. అరుణ్ అందించాడు. త్వరత్వరగా వాటిని పరిశీలించిన విన్సెంట్‌కు హేమంత్ పరిస్థితికి కారణం అర్ధమైంది.

అతడు వెళ్ళి హేమంత్ పక్కన మరో కుర్చీలో కూర్చున్నాడు. అతడు హేమంత్ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"హేమంత్, బీయింగ్ యాన్ ఎక్స్‌పర్ట్ కార్డియాక్ సర్జెన్ నువ్విలా అధైర్యపడకూడదు. పరిస్థితి మనచేతిలోనే వుందని నా నమ్మకం. బి బ్రేవ్."

"సర్, ఎవ్విరి థింగ్ రెడీ ఫర్ ది సర్జరీ" జూనియర్ డాక్టర్ మదన్ వచ్చి చెప్పాడు.

ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్ విన్సెంట్, డాక్టర్ అరుణ్‌లతోపాటు మరో ముగ్గురు డాక్టర్లు ఉన్నారు.

బయట కుర్చీలో కూర్చుని, దుఃఖాన్ని దిగమింగుకుంటున్న హేమంత్ లతను స్ట్రెచర్‌పై థియేటర్‌లోకి తీసుకు వెళ్తుంటే, ఒక్క ఉదుటున లేచి స్ట్రెచర్‌ను సమీపించాడు.

థియేటర్‌లోంచి వెలుపలకు వచ్చిన అరుణ్, లత ముఖంలోకి చూస్తున్న హేమంత్ భుజంపై చెయ్యివేసి చిన్నగా నొక్కాడు.

"లతకు ఏం కాదురా హేమంత్. షి విల్ బి ఆల్‌రైట్" అంటూ.

"లతా.. ప్లీజ్ నాకోసం. ఇక్కడ నీకోసం, నీ హేమంత్ ఇంకా బ్రతికే ఉన్నాడు. నన్ను వదిలి వెళ్ళకు.. ప్లీజ్" అంటూ ఆమె నుదుటిపై పెదవులతో స్పృశించాడు హేమంత్.

మూసుకున్న ఆపరేషన్ థియేటర్ డోర్‌వైపు కాసేపు అలాగే చూసి, నెమ్మదిగా లిఫ్ట్ వైపు నడిచాడు అతడు.

నాలుగవ అంతస్తులో ఉన్న తన సూట్‌కు వెళ్ళాడు యాంత్రికంగా. ఏదో గుర్తుకు వచ్చినట్టు వెంటనే లేచాడు. అల్మరా తెరిచి పై అరలో ఉన్న ఆల్బం తీసుకుని నెమ్మదిగా వెళ్ళి సోఫాలో చేర్లబడ్డాడు అతడు.

నెమ్మదిగా ఆల్బం ఓపెన్ చేశాడు. మొదటి పేజీలోనే ఉన్న లత ఫోటోను గుండెకు హత్తుకుని బాధగా కళ్ళు మూసుకుని పడుకున్నాడు హేమంత్.

"లతకు ఏం కాకూడదు...ఏంకాకూడదు. లత నాది కాకపోయినా గాని, తను సుఖంగా వుండాలి. తను ఎందుకు నా దగ్గరకు బయలుదేరిందో? పాపం హెల్త్ పరిస్థితి ఇలా ఎందుకు మారిపోయిందో? ఇన్ని ప్రశ్నలకు నాకు జవాబు ఎలా దొరుకుతుంది?

'ఎంత చిత్రం! కొన్ని సంవత్సరాల తర్వాత తనకు దూరమైన లత ఇలా కలిసింది. లతతో జీవితం పంచుకుని కలిసి హాయిగా ప్రయాణం చెయ్యాలనుకున్నాడు. ఆ బంధాన్ని విధి కాల రాసింది కర్కశంగా.

తనకోసం ఆగ్రాకు రావాలని విజయవాడలో ఒంటరిగా ఎందుకు ఎక్కింది ట్రైన్? అంతుపట్టని ఆవేదనతో అతడికి స్థిమితంలేకుండా వుంది.

డోర్ మీద కొడుతున్న శబ్దానికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడతడు.

"కమిన్" అన్నాడు.

తలుపు నెట్టుకుని లోపలకు వచ్చిన సిస్టర్ వైపు ఆత్రంగా చూసాడతడు.

"ఏమైంది?" అంటూ.

"ఆపరేషన్ జరుగుతుంది సార్" అంటూ ఒక కవర్‌ను టీపాయ్ మీద పెట్టింది. ప్రశ్నార్ధకంగా చూస్తున్న హేమంత్‌కు,

"సర్ ఆవిడ జ్యుయెలరీ" అని చెప్పింది.

"సరే" అన్నాడు. అతడి మనసు మరింత బాధకు లోనైంది.

"సార్, మీకేమైనా కావాలా? కాఫీ పంపించమంటారా?" అడిగింది.

"వద్దమ్మా. థాంక్యూ" అన్నాడు నెమ్మదిగా.

సిస్టర్ తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది.

నెమ్మదిగా కవర్ ఓపెన్ చేశాడు హేమంత్. ఒక్క క్షణం బాధగా కళ్ళు మూసుకున్నాడు.

టీపాయ్ మీదున్న న్యూస్ పేపర్‌పై కవర్‌ను వంచాడు. నాలుగు గాజులు, లాకెట్ చెయిన్, రెండు ఉంగరాలు, జుంకాలు, వాచ్ ఉన్నాయి.

లాకెట్ చెయిన్‌ను చేతిలోకి తీసుకుని చూశాడు. అతడి గుండె స్పందన పెరిగింది. లాకెట్‌ను చూశాడు దగ్గరగా. పింక్, గ్రీన్ స్టోన్స్‌తో 'హెచ్ ఎల్ ' అన్న ఇంగ్లీషు అక్షరాలు అందంగా ఉన్నాయి.

అతడు సోఫాలో పడుకుని, లాకెట్‌ను గుండెకు హత్తుకుని "లతా..లతా" అంటూ దుఃఖించాడు మనసులో.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS